క్లుప్తంగా

పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతం



ఏఎస్సైలతో ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీస్ అధికారుల సేవలు స్ఫూర్తివంతమని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. పదవీవిరమణ పొందుతున్న ఏఎస్సైలు చంద్రశేఖర్, కరుణాకర్, అంజయ్యలను శనివారం సాయంత్రం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నోరకాల త్యాగాలతో పాటు, దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు భీంరావు, డీఎస్పీ రఘుచందర్, ఆర్ఐ వేణు, ఆర్ఎస్సై కృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ మోహన్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశముంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని డ్రెయినేజీలను ప్రతి రోజూ శుభ్రం చేయాలన్నారు. అలాగే ఖాళీ ప్రదేశాల్లో చెత్త నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట సిబ్బంది రత్నాకర్, ముజీబ్ ఉన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాయికల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ శనివారం పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వార్డుల్లో ఫాగింగ్ చేయాలని ఆదేశించారు.

పాఠశాలల్లో మరమ్మతు పనులు..



పాఠశాలలో ఎంపీడీవో,ఎంపీవో

కథలాపూర్: మండలం లోని బొమ్మెన, సిరికొండ, తక్కళ్లపెల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతుల పనులను ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ శనివారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అనంతరం గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. వర్షాకాలంలో మురికి కాలువల్లో చెత్త చెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు.

మహిళాశక్తి యూనిట్ల సందర్శన

జగిత్యాలరూరల్: జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని మహిళాసంఘం సభ్యులు నిర్వహిస్తున్న మహిళాశక్తి యూనిట్లను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం వాసులు లలితకుమారి, ధనలక్ష్మీ శుక్రవారం పరిశీలించారు. కోల్డ్‌ప్రెస్ ఆయిల్, పిండి, మిర్చి గిర్నీ, మినీ రైస్‌మిల్, పెళ్లి కుండల తయారీ యూనిట్లపై ఆరా తీశారు. వాటి తయారీ విధానం, రుణం, మార్కెటింగ్, బ్రాండింగ్, ఆదాయంపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సంపత్‌రావు కుట్టుకేంద్రాన్ని పరిశీలించి రెండోదశ స్కూల్ డ్రెస్‌ల అప్పగింతను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. డీపీఎం వెంకటేష్, ఏపీఎం గంగాధర్, సీసీ మరియ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మారు సత్తవ్వ, వీవోఏలు భాగ్యలక్ష్మీ, రాజ్యలక్ష్మీ, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపర్చండి

• ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, అధికారులు

జగిత్యాల: పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, పట్టణాభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా పారిశుధ్యం మెరుగుపర్చాలని, ఎప్పటికప్పుడు డ్రెయినేజీలు, రోడ్లన్నీ చెత్త శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు సైతం అన్ని రకాల షూస్, గ్లౌస్‌లు, బట్టలు అందించేలా చూడాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని అందించాలని ఆదేశించారు. అలాగే పలు శాఖల్లో వస్తున్న ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగంలో అనేక అవకతవకలు జరిగినట్లు తెలుస్తుందని, దీనిపై పూర్తి రికార్డులు ఇవ్వాలని సూచించారు. 'సాక్షి'లో పాలన గాడిలో పడేనా అనే కథనం ప్రచురితం కావడంతో అందులోని ప్రశ్నలను సభ్యులు ప్రస్తావించారు. ప్రతిపక్ష సభ్యులు డ్రెయినేజీలు మెరుగుపర్చాలని, లేనిచో రోడ్లపై ఉన్న మురికినీరు ఇళ్లలోకి వస్తుందని సూచించగా మరమ్మతులు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారు లేనిదే ప్రజారోగ్యం లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జగిత్యాల బల్దియాలో తోట గంగారాం అనే కార్మికుడు పదవీ విరమణ పొందగా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారు కోవిడ్‌లో సైతం ప్రాణాలు లెక్కచేయకుండా విధులు నిర్వహించిన తీరు మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంస్కృత కళాశాలకు పూర్వవైభవం తెస్తాం

ధర్మపురి: పట్టణంలో ఆదరణ లేకుండా ఉన్న సంస్కృత కళాశాలను పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సంస్కృతాంధ్ర కళాశాలను శనివారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరితో కలిసి సందర్శించారు. కళాశాల విశిష్టత, ఘనత, మూసివేతకు గల కారణాలను కళాశాల కరస్పాండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో పూర్వవైభవం తెస్తామని, ఈ మేరకు ఉన్నత విద్యా మండలి అధికారులతో మాట్లాడామని తెలిపారు. ధర్మపురిలో డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్, కరస్పాండెంట్ ఎస్.రామకిష్టయ్య, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు మరువలేం

ధర్మపురి: అంగన్‌వాడీల సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని గిరిజన వసతి గృహంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్స్ రివైజ్డ్ ప్రీస్కూల్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి శనివారం విప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో డీడబ్ల్యూవో వాణిశ్రీ సూపర్‌వైజర్లు కుసుమ, అండాలు, శైలజ, లత, నీలిమ మాస్టర్ ఫైనాన్స్ పవిత్ర, రాధిక, నాయకులు వేముల రాజు తదితరులున్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడకు చెందిన కొమురెల్లి చంద్రలేఖను కులం పేరుతో దూషించిన ఎడల్ల జగన్ అలియాస్ చరణ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. చింతకుంటవాడకు చెందిన చంద్రలేఖ కోరుట్లలో పాలిటెక్నిక్ రెండో సంవత్సరం చదువుతోంది. జగిత్యాలలోని కృష్ణానగర్‌కు చెందిన జగన్ అలియాస్ చరణ్ గత కొద్దికాలంగా ప్రేమిస్తున్నానంటూ వెంట పడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి జగన్ అలియాస్ చరణ్ చంద్రలేఖ ఇంటికి వెళ్లి కులం పేరుతో దూషించడంతో పాటు చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై..

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని విద్యానగర్‌కు చెందిన మహిళను వేధిస్తున్న పోలె గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై నరేశ్ తెలిపారు. సదరు మహిళ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం అనంతపల్లిలోని తన చిన్నమ్మ వద్ద ఉంటున్న సమయంలో ఐదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన పోలె గణేశ్‌తో పరిచయం ఏర్పడింది. ఆమె భర్త కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా.. ఇద్దరు కూతుళ్లతో కలిసి విద్యానగర్‌కు చేరుకుని నివాసముంటోంది. ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని తరచూ ఫోన్‌లో వేధిస్తున్నాడు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకుంటే ఇంటికొచ్చి వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలి



మాట్లాడుతున్న డీసీవో సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం: సాగు చేస్తున్న ప్రతీ రైతుకు రైతు భరోసా ఇవ్వాలని పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. శనివారం ఇబ్రహీంపట్నం సొసైటీలో, మండలంలోని తిమ్మాపూర్, యామాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నిర్వహించిన సమావేశాల్లో రైతు భరోసాపై పలువురు రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీవో సత్యనారాయణ మాట్లాడుతు రైతులు రైతు భరోసాపై అభిప్రాయాలను వెల్లడించేందుకు వచ్చే నెల 4 వరకు రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల అభిప్రాయాలను సేకరించి, ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు 10 ఎకరాలు ఉన్న ప్రతి రైతుకు తప్పనిసరిగా రైతు భారోసా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ నిజామొద్దీన్, సింగిల్‌విండో చైర్మన్లు బద్దం గోపి, బాస శ్రావణ్, అంకతి రాజన్న, వైస్ చైర్మన్ జిల్లాల పవన్, ఎంపీటీసీ తిమ్మణి రాములు, సుగుణాకర్‌రావు, సీఈవో మంత్రి సతీష్‌కుమార్, సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

'యావర్ రోడ్డు విస్తరణ రాజకీయాలకోసమేనా?'

జగిత్యాలటౌన్: యావర్ రోడ్డు విస్తరణను రాజకీయాల కోసం వాడుకోకుండా పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వంద ఫీట్లకు విస్తరించాలని బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి కోరారు. శనివారం జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం కృష్ణహరి మాట్లాడారు. యావర్ రోడ్డు విస్తరణకు గతంలో రెండు సార్లు తీర్మానాలు చేసినా.. బల్దియా కేవలం మార్కింగ్ ఇచ్చి వదిలివేశారని గుర్తు చేశారు. ఏదో ఒక ఎన్నిక వస్తుందంటే చాలు యావర్ రోడ్డు విస్తరణ తెరపైకి తెచ్చి లబ్ధి పొందాలని చూడటం షరా మామూలుగా మారిందన్నారు. గతంలో మార్కింగ్ ఇచ్చిన అధికారులు రోడ్డు విస్తరణ ఎందుకు పూర్తి చేయలేకపోయారో పట్టణ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసమే యావర్‌రోడ్డు అంశాన్ని మరోసారి ముందుకు తెస్తున్నారని అన్నారు. బాధితులకు తగిన పరిహారం చెల్లించి వెంటనే రోడ్డును వంద ఫీట్లకు విస్తరించాలని,మిగతా టెండర్ అయిన రోడ్లు పూర్తిచేయాలని కోరారు.

జాతీయ పురస్కారాలకు భక్త మార్కండేయ కళామండలి

మల్యాల: మండలంలోని శ్రీ భక్త మార్కండేయ కళా మండలి సభ్యులు తెలుగు వెలుగు సాహితి వేదిక మహానంది జాతీయ పురస్కారాలకు ఎంపికయ్యారు. బండారి అశోక్, కుసుమ గణేశ్, రాగుల రవీందర్, పన్నాటి సంతోష్, బోగ పురుషోత్తం, కొక్కుల సుధాకర్, బొద్దుల మహేందర్, దాసరి గంగారాం, గుమ్మడి మల్లేశం, బాలె శ్రీనివాస్, రాగుల సురేశ్, గుర్రం మనస్విని పురస్కారాలకు ఎంపికయ్యారని, ఈ నెల 30న కరీంనగర్‌లో జరిగే సమావేశంలో పురస్కారాలు అందజేస్తామని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ రాజ్‌కుమార్ తెలిపారు.

కిక్ బాక్సింగ్ విజేతలకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

జగిత్యాలటౌన్: జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులను శనివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అభినందించారు. ఇటీవల మహారాష్ట్రలోని పూణే ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో అండర్ -14 పాంట్ ఫైటింగ్‌లో విభాగంలో జగిత్యాల జిల్లాకు చెందిన సాయిసృజన్ సిల్వర్ మెడల్, పి కృష్ణ కాంస్యపతకం సాధించగా, వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ రామాంజనేయులు, విద్యార్థులు స్నిగ్ధప్రియ, వినన్య, హర్షిత్ ఉన్నారు.

కళావిహీనంగా గర్భగుడి గోడలు



వెండి తోరణం లేక వెలవెలబోతున్న గర్భగుడి

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయంలో గతేడాది దొంగలు చోరీకి పాల్పడిన విషయం తెల్సిందే. ఆ సమయంలో గర్భగుడి గోడలకున్న వెండి తోరణాలను ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి కొత్తవి చేయించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఆలయానికి రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. వెండి తోరణాలు చేయించడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని భక్తులు అంటున్నారు.

దొంగల చేతివాటం

కొండగట్టు: కొండగట్టుకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వారి చేతివాటాన్ని ప్రదర్శించారు. చైన్, డబ్బుల చోరీకి పాల్పడ్డారు. స్థానికులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని గుర్తించి పోలీసులకు అప్పగించారు.

60వ సారి రక్తదానం

మేడిపల్లి: మండల కేంద్రానికి చెందిన అంధ కళాకారుడు సింగర్ రవికి అత్యవసరంగా రక్తం అవసరం ఉండటంతో భీమారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన జీర్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనంద్ కరీంనగర్ వెళ్లి రక్తదానం చేశారు. ఆనంద్ దీనితో కలిపి ఇప్పటి వరకు 60సార్లు రక్తదానం చేసారు. ఈ సందర్భంగా ఆనంద్‌ని పలువురు అభినందించారు.

రూ.80 వేల ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని దుంపేట గ్రామానికి చెందిన బండెడ్ల భాగ్యమ్మకు మోకాలి ఆపరేషన్ కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రూ. 80 వేల ఎల్‌వోసీ మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు తెలిపారు. ఎల్‌వోసీ మంజూరు చేయించినందుకు కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


ప్రభుత్వ పథకాల్లో అర్హుల ఎంపికకు క్యాంపులు

జగిత్యాల: ప్రధానమంత్రి స్వానిధి సమృద్ధి పథకం ద్వారా వీధి వ్యాపారుల కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం పథకాలు అమలు చేసేందుకు జిల్లాలోని మున్సిపాలిటీల్లో జులై 1 నుంచి 6 వరకు క్యాంపులు నిర్వహించనున్నట్లు మెప్మా ఏవో శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో క్యాంపులు నిర్వహించి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, జన్‌ధన్‌యోజన, వన్ నేషన్ వన్ రేషన్, శ్రమయోగి మందన్‌యోజన, రిజిస్ట్రేషన్ అండర్ బీవోసీ, జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకాలకు అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

ఇబ్రహీంపట్నం: గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా పనులు చేపట్టాలని ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని డబ్బా గ్రామంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చెత్తాచెదారం లేకుండా తొలగించి మురికి కాలువలో బ్లీచింగ్ చల్లుతు,దోమల నివారణకు పిచికారీ చేయాలని కోరారు. తాగునీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను కలుపాలని, నీటి నిలువ గుంతలలో ఆయిల్‌బాల్స్ వేయాలని తెలిపారు. అనంతరం ఎంపీటీసీలు దెశెట్టి శాంత, జీవన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాణి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఆయా' నే అంగన్‌వాడీ టీచర్



పిల్లలతో అక్షరాలు రాయిస్తున్న ఆయా

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రం -1 లో ఆయానే అంగన్‌వాడీ టీచర్‌గా మారింది. ఈ కేంద్రంలో టీచర్ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో మరో కేంద్రానికి చెందిన టీచర్‌కు ఇన్‌చార్జిగా విధులు అప్పజెప్పారు.కానీ ఆ టీచర్ సమయం దొరికినప్పుడు మాత్రమే వస్తోంది. మిగతా సందర్భాల్లో ఆయానే చిన్నారులకు తెలుగు,ఇంగ్లిష్ అక్షరమాలను నేర్పిస్తోంది.అలాగే మధ్యాహ్నం సమయానికి పౌష్టికాహారం వండిపెడుతోంది. కాగా ఈ కేంద్రంలో చిన్నారు 14 మంది ఉండగా శనివారం 9 మంది చిన్నారులు హాజరయ్యారు.మొత్తంగా టీచర్ లేకున్నా కేంద్రాన్ని సక్రమంగా నడుపుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది ఆయా గంగ.

ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

కోరుట్ల: వర్షాకాలంలో పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను బీజేపీ సభ్యుడు మాడవేణి నరేశ్ సహా సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. డ్రెయినేజీలు శుభ్రంగా లేవని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులున్నాయని కౌన్సిల్ సభ్యులు నిలదీశారు. ఈ సందర్భంగా కొంత సేపు సభలో గందరగోళం నెలకొంది. డ్రెయినేజీల శుభ్రత, తాగునీటి సరఫరా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామని చైర్‌పర్సన్ లావణ్య పేర్కొన్నారు. అనంతరం 34 అంశాలకు కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారు. పట్టణంలో రోడ్లపై గుంతలు పూడ్చటం, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, శానిటేషన్, మురుగు కాల్వలపై స్లాబ్‌లు వేయటం, కల్వర్టుల నిర్మాణం, వంటి అంశాలను సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, కమిషనర్ బట్టు తిరుపతి,ఏఈ లక్ష్మి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల విక్రయంపై నిరసన



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నారని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి మాదవేని సునీల్ అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల విక్రయాలను శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై డీఈవో, ఎంఈవోల దృష్టికి ఎన్నిసార్లు తీసుక వెళ్లినప్పటికీ ఏలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. అధికారులు ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్నారని పేర్కొన్నారు. అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ.. పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న స్కూళ్లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో మహదేవ్, సూరజ్, రంజిత్, నితీష్, హర్షవర్ధన్, లవన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇప్పపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లిలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రజలు కలిసిమెలిసి ఉండాలని, కుల వివక్ష చూపవద్దని అధికారులు సూచించారు. గ్రామంలో ఎవరైనా అంటరానితనం అంటూ అవమానిస్తున్నారా అనే విషయాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్, ఎంఈవో ఆనందరావు, ఆర్ఐ నాగేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన ఎడమల లక్ష్మారెడ్డి శనివారం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, ఇతర సామగ్రి అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్‌పల్లి: పట్టణంలోని శాంతినగర్, బీజే కాలనీల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శనివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలతో పాటు ఇతర స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రతీ ఏడాది పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో కిషోర్, సన్నీ, రాజేశ్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ

గొల్లపల్లి: మండలంలోని భీంరాజ్‌పల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులను ఉపాధ్యాయులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 1–5వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ బొమ్మెన కుమార్, ఉపాధ్యాయులు రజిత, శ్యామల, సింగారపు లచ్చయ్య, సింగారపు మహేశ్, కొలగాని ఎర్రయ్య పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన

వెల్గటూర్: మండలంలోని రాజక్కపల్లిలో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో సంభవించే అంటువ్యాధుల గురించి, దోమకాటు వల్ల సంక్రమించే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమల ఆవాసానికి కారణమవుతాయని, మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులకు కారణమయ్యే దోమల నివారణ గురించి, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జగన్నాథం, ఏఎన్ఎం జయప్రద, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గానికి సన్మానం

మేడిపల్లి: మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మహిళా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలంలోనే మొట్టమొదటిసారిగా మహిళలతో కార్యవర్గం ఏర్పాటు చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో తోకల రవి, తోకల నర్సయ్య, దేశవేని క్రిష్ణ, తోకల ప్రభాకర్, జిల్లా రమేశ్, గడీల గంగాధర్, రమ్య, ఆర్మూరి లత, తోపారపు రేఖ, మానస, ఐలేని లావణ్య, సూరమ్మ, పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఇల్లెందుల శ్రీనివాస్

మెట్‌పల్లి: లయన్స్ క్లబ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇల్లెందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండా రాకేశ్, కోశాధికారిగా నాంపల్లి వేణుగోపాల్, జోన్ చైర్మన్‌గా గడ్డం శంకర్‌రెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు.

ఇసుక డంపులకు వేలం

ధర్మపురి: మండలంలోని తిమ్మాపూర్‌లో ఇసుక డంపులకు వేలం పాటలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కృష్ణచైతన్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మాపూర్ శివారులో సుమారు 240 ట్రాక్టర్ల అక్రమ ఇసుక డంపులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డంపులను జులై 2న ఉదయం 11–30 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని, ఆసక్తి గల వారు దరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

మొక్కలు నాటిన మెకానిక్

కొండగట్టు: కొండగట్టు ఘాట్ రోడ్ నుంచి గుట్ట మీద వరకు శనివారం హుస్నాబాద్‌కు చెందిన సత్యనారాయణ అనే సామాజిక సేవకుడు 500 మొక్కలను తన సొంత ఖర్చుతో నాటాడు. ప్రస్తుతం సత్యనారాయణ కరీంనగర్ వర్క్ షాప్ సమీపంలో మెకానిక్ గా పనిచేస్తున్నాడు. గతంలో కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం, శాతవాహన యూనివర్సిటీ, రైల్వే స్టేషన్ ,కోర్టు, శ్మశానవాటిక ఆవరణలో సుమారు 70 వేల మొక్కలు సొంత డబ్బులతో నాటానని, మొక్కలు నాటడం ఇష్టమని ఆయన తెలిపారు.

పాఠశాలలో ఉపాధ్యాయులు..

రాయికల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ చెట్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాల ఆవరణలో హెచ్ఎం శ్రీపతి రాఘవులు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేశ్, రవీందర్, మల్లేశం, గంగజమున, సత్యనారాయణ, నాగరాజు, గంగాధర్, వనిత, శివనందం, ఫాతిమ, పద్మజ, పీడీ గంగాధర్ పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుడికి నివాళి

వెల్గటూర్ : నక్సల్స్ చేతిలో హతమైన పోలీస్ అమరవీరుడు పారువెళ్లి కిరణ్ కుమార్ 16వ వర్ధంతిని శనివారం వెల్గటూర్ మండల కేంద్రంలో కుటుంబసభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ కమాన్ వద్ద ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 16 ఏళ్ల క్రితం నక్సల్స్ దాడిలో జగదేవుపేటకు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ పారువెళ్లి కిరణ్ కుమార్ అమరుడయ్యాడు.

బాధిత కుటుంబానికి కొప్పుల పరామర్శ

వెల్గటూర్: మండలంలోని పైడిపెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గంగుల నగేశ్ తండ్రి గంగుల సత్తయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గంగుల అశోక్, మండల పార్టీ అధ్యక్షులు చల్లూరి రాంచంద్రం, జూపాక కుమార్, మూగల సత్యం తదితరులు ఉన్నారు.

రైతు భరోసాపై నేడు అభిప్రాయసేకరణ

సారంగాపూర్: ప్రభుత్వం రైతుభరోసా కింద పెట్టుబడి సాయం అందించే కార్యక్రమంపై ఆదివారం సారంగాపూర్, బీర్‌పూర్, కొల్వాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని రైతుల అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు సీఈవోలు శివ, తిరుపతి, రాజేందర్ తెలిపారు. సమావేశాల్లో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.